క్లుప్తంగా

గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు



కోటనందూరులో గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఇందిరాప్రియదర్శిని

కోటనందూరు: స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రీన్ అంబాసిడర్లకు వైద్యపరీక్షలు నిర్వహించారు. పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో కోటనందూరు, పాతకొట్టాం పీహెచ్‌సీల్లో వైద్యులు గ్రీన్ అంబాసిడర్లకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పరిసరాలను శుభ్రం చేసే గ్రీన్ అంబాసిడర్లు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో వారికి వైద్య పరీక్షలు చేస్తున్నట్టు పంచాయతీ విస్తరణాధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ ఇందిరాప్రియదర్శిని, పంచాయతీ, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

కిర్లంపూడి: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని వీహెచ్‌ఏ హరిత సూచించారు. మండలంలోని గోనేడ తదితర గ్రామాల్లో గురువారం ఉద్యానవన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేశారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే రైతు భరోసా, పంట నష్టపరిహారం తదితర ప్రభుత్వ పథకాలను పొందవచ్చన్నారు. రైతులు తప్పకుండా ఈ–క్రాప్, ఈ–కేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఘనంగా బలరామ జయంతి



ప్రత్తిపాడులో రైతు నాగేశ్వరరావును సత్కరిస్తున్న బీకేఎస్ ప్రతినిధులు

ప్రత్తిపాడు: స్థానిక మునసబుగారి రామాలయం ఆవరణలో గురువారం భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) ఆధ్వర్యంలో బలరామ జయంతి నిర్వహించారు. బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు గోప్ప నారాయణ మూర్తి సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ బలరామ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆరు దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తోన్న రైతు నామసాని నాగేశ్వరరావును బీకేఎస్ ప్రతినిధులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి, సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో బీకేఎస్ కమిటీలను ఏర్పాటు చేసి, సంఘాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. బలరాముని ఆదర్శంగా తీసుకుని వ్యవసాయ రంగం వైపు యువత పయనించాలని కోరారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా, గట్టి అశోక్, శింగిలిదేవి సత్తిరాజు, అప్పారావు, పంది వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోకవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపట్టడంతో శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఏఈ అశోక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గోకవరం, కృష్ణునిపాలెం, రామన్నపాలెం, కొత్తూరు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, కొత్తపల్లి, జగన్నాథపురం, కామరాజుపేట, మల్లవరం, సూదికొండ, వీరలంకపల్లి, గంగంపాలెం, రంపయర్రంపాలెం, ఠాకూరుపాలెం, పెంటపల్లి తదితర గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

కిర్లంపూడి: కృష్ణవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట ట్రాన్స్ కో ఏఈ రత్నాలరావు తెలిపారు. బూరుగుపూడి, సోమరాయణంపేట, కృష్ణవరం, సోమవరం, గోనేడ, పాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఉపాధి ఏపీవోగా రామచంద్రరావు

తొండంగి: మండల ఉపాధి హామీ ఏపీవోగా ఎం.రామచంద్రరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ శంఖవరం మండల ఏపీవో రోజా ఇక్కడ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. కోటనందూరు మండల ఏపీవోగా పని చేస్తున్న రామచంద్రరావును ప్రభుత్వం తొండంగి మండలానికి బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

పశువుల పాక దగ్ధం

జగ్గంపేట: మండలంలోని వెంగాయమ్మపురంలో గురువారం పశువుల పాక, గడ్డివాము దగ్ధమయ్యాయి. అప్పన్న పెదకాపుకు చెందిన పశువుల పాక పరిసరాల్లో అజాగ్రత్తగా పొగ తాగడంతో ఈ ప్రమాదం జరిగినట్టు జగ్గంపేట అగ్నిమాపక అధికారి ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు ఆయన వివరించారు.

ఉద్యాన సాగు.. ప్రోత్సాహకాలు బాగు

- సహకరిస్తున్న ప్రభుత్వం
- రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాల అందజేత
- మెట్టలో రోజురోజుకూ పెరుగుతున్న తోట పంటల సాగు
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు



పైడికొండలో బిందు సేద్యం యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తొండంగి: మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో రైతులు ఉద్యాన తోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ నీటి వనరులతో లాభదాయకంగా ఉండటంతో రైతులు బిందు, తుంపర సేద్యాలను అవలంబిస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో వీటి ఏర్పాటుకు ప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా 50 నుంచి 90 శాతం వరకూ రాయితీలు అందిస్తోంది. దీంతో మెట్ట ప్రాంత రైతులు బిందు, తుంపుర సేద్యాలపై మొగ్గు చూపుతున్నారు.

బిందు సేద్యంతో సాగు చేసే ఉద్యానవన తోటలు

మెట్టలో మామిడి, జీడిమామిడి, కొబ్బరి, జామ, పామాయిల్, సపోట, అరటి తోటల సాగుకు బిందు సేద్యం అనుకూలంగా ఉంటుంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు బిందు సేద్యం యూనిట్లను ప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా రాయితీపై మంజూరు చేస్తోంది. బిందు సేద్యం ద్వారా చెట్టు తల్లివేరుకు అవసరమైన నీటిని అందిస్తారు. ఈ పద్ధతిలో నీరు వృథా కాకుండా తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చు.

రాయితీపై పరికరాలు పొందేందుకు అర్హతలు ఇలా..

ఐదెకరాల లోపు పొలం ఉన్న అన్ని కులాల రైతులకు 90 శాతం రాయితీపై ప్రభుత్వం డ్రిప్ పరికరాలు మంజూరు చేస్తోంది. రైతు పది శాతం వాటాను భరించాలి. ఐదెకరాల కంటే పైబడి భూమి కలిగిన రైతులకు 50 శాతం రాయితీ వర్తిస్తుంది. రైతు మిగిలిన శాతం భరించాల్సి ఉంటుంది. యూనిట్ విలువను బిందు సేద్యం పైపుల సంఖ్య, వ్యవసాయక్షేత్రంలో బోరు ఉన్న ప్రదేశం ఆధారంగా ఫీల్డ్ అధికారి నిర్ణయిస్తారు. ఈ యూనిట్ కావాల్సిన రైతుల పొలంలో కచ్చితంగా వ్యవసాయ బోరు ఉండాలి. భూ యజమాని ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, 1బీ ఫారం, ఎఫ్‌ఎంబీ ఫారం, ఫోన్ నంబర్ వివరాలతో గ్రామ సచివాలయ ఉద్యానవనశాఖ అసిస్టెంట్లను సంప్రదించాలి.

తుంపర సేద్యంతో పువ్వుల సాగు

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు కొద్దిపాటి విస్తీర్ణంలో పలు రకాల కూరగాయలు, పువ్వులు సాగు చేస్తుంటారు. ఈ సాగుకు తుంపర సేద్యం ఎంతగానో అనుకూలంగా ఉంటుంది. చిన్న రైతులు చేసే బంతి, చామంతి, గులాబీ తదితర రకాల పువ్వుల సాగుతో పాటు, కొత్తిమీర, తోటకూర, టమాటా, బెండ, ఆనబ, సొరకాయ వంటి కూరగాయల సాగుకు తుంపర సేద్యం అనుకూలమని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఐదెకరాల లోపు ఉన్న చిన్న, సన్న కారు రైతులకు 55 శాతం రాయితీపై తుంపర సేద్యం యూనిట్లను అందిస్తోంది. ఐదెకరాల పైబడి భూమి ఉన్న రైతులకు 45 శాతం రాయితీతో అందిస్తోంది.

రూ.29 వేల రాయితీ వచ్చింది



నాకున్న మూడెకరాల పొలంలో పామాయిల్ సాగు చేస్తున్నాను. బిందు సేద్యం యూనిట్ ధర రూ.60292 కాగా రాయితీ రూ.29643 వచ్చింది. నేను రైతు వాటాగా రూ.34267 చెల్లించాను. దీంతో బిందు సేద్యం యూనిట్, పైపులైన్లు ఏర్పాటు చేశారు. గతంలో బోరు సాయంతో సాగు చేశావాడిని. ఇప్పుడు బిందు సేద్యంతో పామాయిల్ చెట్లకు నీరు సమృద్ధిగా అందుతోంది.

–ఎం.శామ్యూల్, రైతు, పైడికొండ, తొండంగి మండలం

మెట్ట రైతులకు ఎంతో మేలు



మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో రైతులకు బిందు, తుంపర సేద్యంతో ఎంతో మేలు చేకూరుతుంది. ప్రభుత్వం రాయితీ ఇవ్వడంతో రైతులు ఈ పద్ధతులను అవలంబిస్తున్నారు. తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో బిందు, తుంపర సేద్యాలకు కలిపి దాదాపుగా 95 మంది రైతులు రాయితీపై యూనిట్లు పొందారు. ఇంకా ఆసక్తి కలిగిన రైతులు ఉంటే ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలి. వెంటనే మంజూరుకు చర్యలు తీసుకుంటాం.

–గుత్తుల విజయలక్ష్మి, ఉద్యానవనశాఖాధికారి, తుని

ప్రజా సంక్షేమమే లక్ష్యం



తుని అమ్మాజీపేటలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. తుని పట్టణం 9వ వార్డులో గురువారం సాయంత్రం కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీను ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాల రూరంలో చేకూరిన లబ్ధిని వివరించారు. అర్హత ఉండి పథకాలు రాకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పలువురు మహిళలు స్థానికంగా ఉన్న సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ ప్రసాదరాజును చైర్‌పర్సన్ సుధారాణి ఆదేశించారు. గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచంద్రరెడ్డి, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’తో సమస్యల పరిష్కారం



జగపతినగరంలో శ్మశానవాటికకు వెళ్లే రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీవో సీతారామారావు

కిర్లంపూడి: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తోందని పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామారావు తెలిపారు. కిర్లంపూడిలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజల నుంచి వచ్చిన సమస్యాత్మక ప్రదేశాలను ఆర్డీవో సీతారామారావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లంగిలో జగనన్న కాలనీ, జగపతినగరంలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారులు వేయాలంటూ అర్జీలు వచ్చాయన్నారు. దీనిలో భాగంగా ఈ రెండు రోడ్లను పరిశీలించినట్టు తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు జగనన్న భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ కేవీ మాధవరావు, డీటీ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా



మహిళలకు ఆసరా నిధులు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

తుని రూరల్: మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నారని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. తుని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వి.కొత్తూరు, లోవకొత్తూరు, టి.తిమ్మాపురం గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు మూడో విడత పెండింగ్ వైఎస్సార్ ఆసరా నిధులు రూ.21 లక్షల మంజూరు పత్రాలను ఎంపీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి కట్టుబడిన ఏకైక నాయకుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మ ఒడి, సున్నావడ్డీ రాయితీ తదితర పథకాల ద్వారా మహిళా శక్తిని బలోపేతం చేస్తున్నారన్నారు. కేంద్రం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహనీయుడని పెరిక కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, జెడ్పీటీసీ పోతల సూర్యమణి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, ఎంపీడీఓ పి.రవికుమార్, ఏపీఎం వై.సత్తిబాబు, సర్పంచ్ దుంగల గణపతి రోజామణి, ఎంపీటీసీ పద్మ, నాయకులు లంక కృపానందం, చిటికెల వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటికే వైద్య సేవలు



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

శంఖవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పేద ప్రజలకు వైద్యం చేరువైందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. మండలంలోని అచ్చంపేటలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. యువతుల్లో రక్తహీనత నివారణకు పోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలకు వెళ్లి చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రస్తుతం వర్షాకాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. 50 మంది సాధారణ రోగులు,10 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 40 మంది మధుమేహ బాధితులు, 30 మంది రక్తపోటుతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించామని వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు.

పునరావాస భూముల పరిశీలన



భూములు, రికార్డులను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మమ్మి, అధికారులు

తుని రూరల్: పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న కుమ్మరిలోవ కాలనీవాసుల పునరావాసానికి సేకరించే భూములను, సంబంధిత రికార్డులను, ఇళ్లస్థలాల లేఅవుట్‌ను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మి గురువారం పరిశీలించారు. నిర్వాసితులకు గత ప్రభుత్వం మూడు సెంట్ల చొప్పున భూమి కేటాయించింది. ప్రస్తుత ప్రభుత్వం మూడు సెంట్లకు బదులు ఐదు సెంట్ల భూమి (ఇంటిస్థలం) కేటాయించేందుకు అవసరమైన భూసేకరణను చేపట్టింది. ఈ భూములను క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో 26 ఎకరాలు భూసేకరణ చేయగా ఇప్పుడు మరో 20 ఎకరాలు సేకరించి లబ్ధిదారులకు ఐదు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. కొత్తగా సేకరించనున్న భూమిలో కొంతమేర భూదాన భూములు ఉన్నాయన్నారు. డి–పట్టాలు కలిగిన కొంతమందికి పరిహారం ఇవ్వలేదన్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. రైతులు పరవాడ లోవరాజు, పరవాడ అప్పారావు తమకు రికార్డుల ప్రకారం నష్టపరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్యకు వివరించి న్యాయం చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. పోలవరం కాలువ డిప్యూటీ తహసీల్దార్ కుమారి, ఏఈఈ అనిత, భూసేకరణ సర్వేయర్ జాగ రాలు, మండల సర్వేయర్ దేవుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ



జగ్గంపేటలో రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీని సత్కరిస్తున్న పాస్టర్లు

జగ్గంపేట: క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ అన్నారు. స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో గురువారం యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రైస్తవుల ఆత్మీయ సమావేశం జరిగింది. రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మేడిద జాన్సన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జార్జ్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని క్రైస్తవులకు జగ్గంపేటలో కమ్యూనిటీ హాల్ నిర్మించడం కోసం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పాస్టర్లకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గౌరవ వేతనం ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ముఖ్య అతిథులు, జాన్ వెస్లీని పాస్టర్లు గజమాలతో సత్కరించారు.

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



గండేపల్లి హైస్కూల్‌లో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ దొరబాబు



తునిలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ బాబు, జెడ్పీటీసీ సూర్యామణి

తుని: ప్రభుత్వం విద్యార్థి దశ నుంచి క్రీడలను ప్రోత్సహిస్తోందని తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు అన్నారు. తుని రాజా కళాశాల మైదానంలో గురువారం నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూరామణితో కలిసి ఏఎంసీ చైర్మన్ బాబు ప్రారంభించారు. తుని, తొండంగి, కోటనందూరు మండలాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని ఎంఈవో పరవాడ గీతాదేవి తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

గండేపల్లి: మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎంపీపీ చలగళ్ల దొరబాబు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు అండర్–14,–17 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, షటిల్ పోటీలు నిర్వహించినట్టు పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. గండేపల్లి, జగ్గంపేట, గోకవరం, కిర్లంపూడి మండలాలకు చెందిన 150 మంది క్రీడాకారులు పోటీ పడ్డారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రుత్తల లలిత, ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ తాళ్లూరు మధుకుమార్, సింగరంపాలెం సర్పంచ్ బుద్దరాజు గణపతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌పై హర్షం



బెహరా రాజరాజేశ్వరి

ప్రత్తిపాడు: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంపై జిల్లాస్థాయి విజిలెన్స్ (సివిల్ సప్లయిస్) కమిటీ సభ్యురాలు, ప్రత్తిపాడు జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి గురువారం హర్షం వ్యక్తం చేశారు. మహిళల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళలకే అందిస్తున్నారని తెలిపారు. నాలుగేళ్ల క్రితమే సీఎం జగన్ అన్నిరంగాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు.

గురజాడ జయంతి వేడుకలు

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్లో గురువారం గురజాడ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురజాడ తెలుగు జాతికి అందించిన సాహిత్యం, సమాజ సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు గురజాడ సాహిత్యంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఇ.రాంబాబు, జిల్లా కార్యదర్శి కె.చంటిబాబు, హెచ్ఎం ఎ.లక్ష్మి మాణిక్యం, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఇనకోటి రాంబాబు, అమజాలపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ (అతిథి అధ్యాపకులు) పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ ఎంవీకే మెహర్ గురువారం తెలిపారు. హిస్టరీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు గెస్ట్ లెక్చరర్లను నియమిస్తామన్నారు. పీజీలో 55 శాతం మార్కులు (ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం) కలిగిన వారు అర్హులన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న దీక్షలు

తుని: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ చేపట్టిన నిరాహార దీక్షలు తునిలో గురువారం కొనసాగాయి. ఎమ్మార్పీఎస్ నేతలు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్ మాదిగ, కింతాడ సత్తిబాబు, కండవల్లి అశోక్, ఉలగాటి సామ్యూల్, కాకాడ సాగర్, శ్యాంబాబు, ఆరుగుల సత్తిబాబు, లోకేష్ పాల్గొన్నారు.

ముగిసిన దీక్షలు

గోకవరం: పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు గోకవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సంఘ నాయకులు తహసీల్దార్ కార్యాలయం నుంచి దేవీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

ప్రత్తిపాడు రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ధర్మవరం జాతీయ రహదారిపై ఎమ్మార్పీఎస్ నాయకులు రాస్తోరోకో చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు

కిర్లంపూడి: మండలంలోని ఎరువుల దుకాణాలపై రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రమేష్, వ్యవసాయశాఖ అధికారి భార్గవ మహేష్ మాట్లాడుతూ సోమవరం గ్రామంలోని శ్రీదుర్గా నాగలక్ష్మి ఏజెన్సీలో రూ.21,586 విలువ గల 81 యూరియా బస్తాలు వ్యత్యాసం ఉందన్నారు. శ్రీవిజయ దుర్గా ఫెర్టిలైజర్స్ అండ్ జనరల్ స్టోర్స్‌లో రూ.22,000 విలువ గల అమ్మోనియా సల్ఫేట్ అనాధికారంగా నిల్వ ఉంచినట్టు గుర్తించారు. ఈ రెండు షాపుల్లో రూ.43 వేలు విలువ చేసే ఎరువులను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జీవానందం పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి

గండేపల్లి: భార్యపై అనుమానంతో ఓ భర్త కత్తితో దాడిచేసి గాయపరిచినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని జెడ్.రాగంపేటకు చెందిన శ్రీమంతుల సత్యనారాయణ తన భార్య జ్యోతిపై అనుమానం పెంచుకుని ఆమెతో గొడవపడ్డారు. ఆమెను వధించాలనే ఉద్దేశంతో గురువారం కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో జ్యోతి తలకు తీవ్ర గాయాలు కాగా ఆమెను చికిత్స నిమిత్తం బంధువులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ



గంగంపాలెంలో ఉపాధి పనుల అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న అంబుడ్స్‌మెన్ జ్యోతి

గోకవరం: మండలంలోని గంగంపాలెంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదుపై అంబుడ్స్‌మెన్ ఎం.జ్యోతి గురువారం విచారణ నిర్వహించారు. గ్రామంలోని చెరువు పనుల్లో 67 మందికి దొంగ మస్తర్లు వేసి అవకతవకలకు పాల్పడ్డారని ఇటీవల జరిగిన సోషల్ ఆడిట్‌లో పలువురు గ్రామస్తులు డ్వామా పీడీ పి.జగదాంబకు ఫిర్యాదు చేశారు. దీనిపై డ్వామా పీడీ విచారణకు ఆదేశించగా అంబుడ్స్‌మెన్ విచారణ చేపట్టారు. ఉపాధి కూలీలను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా అంబుడ్స్‌మెన్ జ్యోతి మాట్లాడుతూ తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహిస్తున్నామన్నారు. విచారణ ఇంకా పూర్తికాలేదని, చెరువులో చేపట్టిన ఉపాధి పనులపై సాంకేతికపరంగా కూడా విచారణ నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, ఉపాధి ఏపీఓ శేషఅప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మూషిక వాహనుడిగా దర్శనమిచ్చిన వినాయకుడు



రత్నగిరిపై మూషికవాహనుడి అలంకరణలో వినాయకుడు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం స్వామివారు మూషిక వాహనుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు ఉదయం స్వామివారికి పుష్పాలు, గరికతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం వైదిక కార్యక్రమాల సూపర్‌వైజర్ నాగాభట్ల కామేశ్వరశర్మ, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టి శివ, యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం

ప్రత్తిపాడు: వినాయక చవితికి ప్రతిష్ఠించిన గణనాథుడు మూడు రోజుల పాటు పూజలందుకుని నిమజ్జనానికి తరలివెళ్లారు. స్థానిక నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేశ్ విగ్రహాన్ని గురువారం నిమజ్జనం చేశారు. మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి లంపకలోవ రహదారిలోని పుష్కర కాలువలో నిమజ్జనం చేశారు.